# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

Cerculated by Visakhapatnam, Srikakulam, Eluru,Thirupathi,Ongolu,Vijayawada,Spsr Nellore, Praksham,Guntur,Chittor,Kurnool,Kadapa

పబ్లిషర్: తెలంగాణ    సంపుటి : 1    సంచిక : 01    శనివారం 10-8-2024    పేజీలు : 4    వెల రూ.- 3






## సుంకిశాలపై మాటల యుద్ధం..

### కేటీఆర్‌కు భట్టి కౌంటర్

ఖమ్మం:మన వెలుగు,సుంకిశాల ప్రాజెక్ట్ విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఈ క్రమంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..కేటీఆర్‌కు కౌంటరిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్ట్‌లు కూలిపోతే మా ప్రభుత్వానికి ఎలా బాధ్యత అవుతుందని భట్టి ప్రశ్నించారు.కాగా, తాజాగా భట్టి విక్రమార్క ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో కాళేశ్వరం, సుంకిశాల కట్టింది బీఆ ర్ఎస్ పార్టీనే. ప్రాజెక్ట్‌లు మీరే కట్టారు కాబట్టి.. అవి కూలితే మీదే బాధ్యత. మా ప్రభు త్వంలో కట్టడాలపై మాది బాధ్యత అవుతుంది. సాగర్‌లోకి నీళ్లు రాకుండా ఉంటాయా?. మేము ఎందుకు దాచిపెడతాము. మేడిగడ్డ కరెక్ట్ కాదిన మేము ముందే చెప్పాం. మీరు కట్టిన ప్రాజెక్ట్‌లు క్వాలిటీ లేకుండా అవినీతితో కట్టారు. రాష్ట్రంలో మిగతా ప్రాజెక్ట్‌లు కూడా చెక్ చేయాల్సి అవసరం ఉంది. ప్రాజెక్ట్‌ల విషయంలో జరిగిన తప్పులను కేటీఆర్, బీఆర్ఎస్ ఒప్పుకుని ప్రజలకు సమాధానం చెప్పాలి. ప్రాజెక్ట్‌లో ఇంజినీర్లు చేయాల్సిన పని మీరు చేయడం ఏంటి? అని ప్రశ్నించారు.




## రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రండి

### ఐటీ సర్వీసెస్ కంపెనీల ప్రతినిధులకు పిలుపు - ఐటి సర్వ్ అలయన్స్ సమావేశంలో రేవంత్ రెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్9 మన వెలుగు,రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికాలోని ఐటీ సర్వీసెస్ కంపెనీల ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఐటీ సంస్థల అసోసియేషన్ ఐటి సర్వ్ అలయన్స్ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న ప్రాజెక్టుల్లో ప్రవాసులు భాగస్వామ్యం పంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'ఎన్నో ఏళ్లుగా కష్టపడి చారిత్రాత్మకమైన హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లను నిర్మించుకున్నాం. ఇప్పుడు మనందరం కలిసి ప్రపంచ స్థాయి నాల్గవ నగరంగా ఫ్యూచర్ సిటీని తయారు చేసుకుంటున్నాం. హైదరాబాద్లో ఇప్పుడు మీరు పెట్టుబడి పెట్టే ప్రతి రూపాయి తప్పకుండా మీ భవిష్యత్తుకు పెట్టుబడిగా ఉపయోగపడుతుంది..' అని స్పష్టం చేశారు. -రాబోయే దశాబ్దంలో హైదరాబాద్‌ను పునర్నిర్మించే భారీ వ్యూహంతో తమ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ, మెట్రో విస్తరణ , మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులను చేపట్టిందని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సభలో మాట్లాడారు.

## సుంకిశాల ప్రాజెక్టుపై అసత్య ప్రచారం

- రిటైనింగ్ వాల్ కూలినా ఎందుకు దాచి పెట్టారు
- సుంకిశాలతో నగర నీటి అవసరాలు తీర్చాం
- నగర నీటికోసం చంద్రబాబు, వైఎస్ కృషి చేశారు
- సుంకిశాల ఘటనకు సిఎం రేవంత్‌దే బాధ్యత
- మంచి జరిగితే వారి ఖాతాలో..లేకపోతే మా ఖాతాలోనా?
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



హైదరాబాద్,ఆగస్ట్9 మన వెలుగు, **న్యూస్,** సుంకిశాల ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నీటి అవసరాల కోసం సుంకిశాల ప్రాజెక్టు ప్రారంభించా మని చెప్పారు. ప్రాజెక్టుకు పునరుజ్జీవం తెచ్చిందే భారాస ప్రభుత్వమని పేర్కొన్నారు. నాగార్జునసాగర్‌లో డెడ్‌స్టోరేజ్ ఉన్నా హైదరాబాద్‌కు నీటి కొరత రాకూడదనే ఈ ప్రాజెక్టు చేపట్టామన్నారు. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీటి కోసం ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. కృష్ణా నదికి నాలుగేళ్లు నీరు రాకపోయినా సుంకిశాల ప్రాజెక్టుతో నీటి ఇబ్బందులు రావు. బెంగళూరు, దిల్లీ, చెన్నైలో నీటి ట్యాంకర్ల కోసం ప్రజలు పోరాడుతున్నారు. హైదరాబాద్‌లో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడే పరిస్థితి లేదు. నగరంలో 50 ఏళ్ల తాగునీటి అవసరాలకు సరిపడేలా ప్రణాళికలు చేశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సుంకిశాల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల హైదరాబాద్‌కు తీరని నష్టం. సుంకిశాల ప్రమాదం జరిగినప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి.



## చైనా రద్దీ నౌకాశ్రయంలో భారీ పేలుడు..!

చైనా, మన వెలుగు, చైనాలోని అత్యంత బిజీ పోర్టుల్లో ఒకటైన నింగ్బో-జౌషాన్ పోర్టులో ఆగిఉన్న నౌకలో శుక్రవారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు తీవ్రతకు దాదాపు 2 కిలోమీటర్ల మేరకు షాక్‌వేవ్ ప్రయాణించిందని ది మిర్రర్ పత్రిక పేర్కొంది.ఇప్పటివరకు ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు.తైవాన్‌కు చెందిన యంగ్ మింగ్ మెరైన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌కు చెందిన వైఎం మొబిలిటీ అనే కార్గోషిప్ మూడో టెర్మినల్‌లో ఆగిఉండగా ఈ ఘటన చోటుచేసుకొంది. చైనా న్యూస్ ఏజెన్సీ షిన్హువా కూడా దీనిని ధ్రువీకరించింది.ఈ నౌక గల్ఫ్ దేశాలకు రవాణా చేస్తుందని అధికారులు చెబుతున్నారు. పేలుడు జరిగే సమయానికి ఇందులో ప్రమాదకరమైన పదార్థాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పేలుడు నుంచి నౌక ఉద్యోగులు, ఇతర సిబ్బంది సురక్షితంగా బయటపడినట్లు అధికారులు పాల్గొన్నారు.

## అడోబ్ సీఈవో శంతన్ నారాయణ్‌తో సిఎం భేటీ

### రాష్ట్రంలో ప్రాజెక్టులపై ఆసక్తి



హైదరాబాద్,ఆగస్ట్9 మన వెలుగు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రఖ్యాత అడోబ్ సిస్టమ్స్ సీఈవో శంతను నారాయణ్‌తో భేటీ అయ్యారు. ఫ్యూచర్ స్టేట్ తెలం గాణకు పెట్టుబడులు లక్ష్యంగా అమెరికాలో పర్యటి స్తున్న ముఖ్యమంత్రి ప్రస్తుతం కాలిఫోర్నియాలోని పలువురు గ్లోబల్ బిజినెస్ లీడర్లతో సమావేశాలు,
చర్చలు జరుపుతున్నారు. అడోబ్ సీఈవోతో సమావే శంలో సీఎం తోపాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ఇతర ఉన్నతాధి కారులు కూడా పాల్గొన్నారు. తెలంగాణలో ప్రజాప్రభుత్వం తలపెట్టిన హైదరాబాద్ 4.0 ఫ్యూచర్ సిటీ నిర్మాణం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ ఏర్పాటు ప్రణాళికలపై శంతను నారాయణ్ ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం పంచుకునేందుకు అంగీకరించారు. టెక్ విజనరీ శంతను నారాయణ్ ను కలుసుకోవటం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు

## భారత్-బంగ్లా సరిహద్దుపై ఆందోళన..



దిల్లీ: మన వెలుగు, కల్లోలిత బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై దాడులు జరుగుతుండంపై భారత్ ఆందో ళన వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో సరి హద్దులో నెలకొన్న పరిస్థితులను సమీక్షి ంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో భారతీయులు, హిందువులు, ఇతర మైనారిటీల భద్రతను ఈ కమిటీ పర్యవేక్షించనుంది. బీఎస్ఎఫ్ తూర్పు కమాండ్ ఏడీజీ నేతృత్వంలో ఈ కమిటీ నియమించినట్లు కేంద్ర హోంశాఖ వెల్లడించింది. ''బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని.. భారత్ - బంగ్లాదేశ్ సరిహద్దు (%×దీదీ%)పై ప్రస్తుత పరిస్థితిని సమీక్షించడానికి మోదీ ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. బంగ్లాదేశ్‌లో ఉన్న భారతీయులు, హిందువులతోపాటు ఇతర మైనారిటీ వర్గాల భద్రతకు సంబంధించి అక్కడి ఉన్నతాధికారులతో ఎప్పటి కప్పుడు సంప్రదింపులు చేపడుతుంది” అని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ తూర్పు కమాండ్ ఏడీజీ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కమిటీలో దక్షిణ బెంగాల్, త్రిపుర విభాగాల బీఎస్ఎఫ్ ఐజీ స్థాయి అధికారులు, ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.



2లో

## జయబచ్చన్‌కు మళ్లీ కోపం వచ్చింది



3లో

## అను'మతి'లేని భవనాలు...

## తెలంగాణ..ఇకపై ఫ్యూచర్ స్టేట్

### అభివృద్ధికి చిరునామా అర్థంలో రేవంత్ వెల్లడి



హైదరాబాద్,ఆగస్ట్9మన వెలుగు,

ఇకపై తెలంగాణను 'ఫ్యూచర్ స్టేట్' అనే ట్యాగ్ లైన్‌తో పిలుద్దామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో ఫ్యూచర్ స్టేట్‌కు తెలంగాణ పర్యాయ పదంగా నిలుస్తుందని చెప్పారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం.. కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. టెక్ యూనికార్న్ సీఈవోలను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఐటీ యూనికార్న్ ప్రతినిధులను తెలంగాణకు ఆహ్వానించారు. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చదిద్దుకుందామని సీఎం పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త బ్రాండ్ తీసుకొచ్చారు. ఇకపై తెలంగాణను తెలంగాణ..ది ఫ్యూచర్ స్టేట్‌గా పిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

# జయబచ్చన్‌కు మళ్లీ కోపం వచ్చింది

**- జయా అమితాబ్ బచ్చన్‌గా పిలవడంపై అభ్యంతరం**

**-రాజ్యసబ ఛైర్మన్ తీరుకు నిరసనగా వాకౌట్**



న్యూఢిల్లీ,ఆగస్ట్9:రాజ్యసభ ఎంపీ, సమాజ్‌వాదీ పార్టీ నాయ కురాలు జయా బచ్చన్ మరో మారు కోపానికి వచ్చారు. తన పేరును పదేపదే జయా అమితాబ్ బచ్చన్‌గా పిలవడంపై అభ్యంతరం తెలిపారు. మహిళలకు సొంతంగా పేర్లు ఉండవా అంటూ ప్రశ్నించారు. ఆమెకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ మద్దతుగా నిలిచారు. మరోసారి జయా బచ్చన్ పేరును జయా అమితాబ్ బచ్చన్‌గా రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సంబోధించడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దీనిపై దన్‌ఖడ్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ..నాకు పాఠాలు చెప్పొద్దు అని తీవ్రంగా స్పందించారు. దాంతో ఛైర్మన్ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేయడంతో సభలో గందరగోళ వాతావరణం ఏర్పడింది. ఛైర్మన్ వైఖరిని నిరసిస్తూ విపక్షాలు వాకౌట్ చేశాయి. దీనిపై జయ మీడియాతో మాట్లాడారు. ఛైర్మన్ ఉపయోగించిన స్వరాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. మేం పాఠశాల విద్యార్థులం కాదు. మాలో కొందరు సీనియర్ సిటిజెన్లు కూడా ఉన్నారు. ప్రతిపక్ష నేత మాట్లాడేందుకు నిల్చున్న సమయంలో ఆయన మాట తీరు బాధించింది. మైక్ కట్ చేశారు.

అలా ఎలా ప్రవర్తిస్తారు? మీరు సెలబ్రిటీ అయితే ఏంటి నేను పట్టించుకోనంటూ తీవ్ర పదజాలం వాడుతుంటారు. ఆయన పట్టించుకోవాలని నేను అడగడం లేదు. ఐదోసారి నేను రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నా. నాకు తెలీదా ఏం మాట్లాడాలో..? ఇలాంటి ప్రవర్తన గతంలో ఎన్నడూ చూడలేదు. దీనిపై క్షమాపణలు చెప్పాలి' అని ఆమె డిమాండ్ చేశారు. ఆ సమయంలో ఆమె వెంట సోనియా గాంధీ కూడా ఉన్నారు.ఇటీవల రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణసింగ్.. జయా అమితాబ్ బచ్చన్ మాట్లాడాలంటూ ఆహ్వానించారు. దీనిపై జయాబచ్చన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. 'జయా బచ్చన్ అంటే సరిపోతుంది' అంటూ పేర్కొన్నారు. 'రికార్డుల్లో మీ పూర్తి పేరు ఇలానే ఉంది' అంటూ చెప్పగా.. 'మహిళలకు స్వతహాగా గుర్తింపు లేదా' అంటూ ఆ రోజు ఒకింత అసహనం వ్యక్తం చేశారు.

# ఉండి ఎమ్మెల్యే రఘురామ టార్చర్ కేసు

**- సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌కు చుక్కెదురు**

**-మధ్యంతర బెయిల్ నిరాకరించిన హైకోర్టు**



అమరావతి,ఆగస్ట్9 ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజుకు కస్టోడి యల్ టార్చర్ కేసులో అప్పటి సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్‌కు చుక్కెదురైంది. ఆయనకు మధ్యంతర బెయిల్ ఇచ్చేం దుకు హైకోర్టు నిరాకరించింది. రఘు రామ ఫిర్యాదుతో గుంటూరులోని నగరపాలెం పోలీసులు నమోదు చేసిన కేసుపై విజయ్‌పాల్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది.రఘురామకు కస్ట్టోడియల్ టార్చర్‌లో గాయాలైనట్లు గతంలో సుప్రీంకోర్టు అభిప్రాయపడిందని సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. విజయ్‌పాల్‌కు ముందస్తు, మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దని కోరారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకొని మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వడానికి ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. మరోవైపు పిటిషనర్ తరఫున జీవీఎస్ కిశోర్ కుమార్ వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారమే రఘురామ కృష్ణరాజును విచారించామని.. కస్టోడియల్ టార్చర్ జరగలేదన్నారు. పిటిషనర్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందని.. ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టును కోరారు. 2021 మేలో తనపై రాజద్రోహం కేసు నమోదు చేసి సీఐడీ అధికారులు రాత్రంతా కస్టడీలో నిర్బంధించి హతమార్చేం దుకు యత్నించారని రఘురామకృష్ణరాజు ఇటీవల నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ సీఎం జగన్, అప్పటి సీఐడీ విభాగాధిపతి పీవీ సునీల్‌కుమార్, అప్పటి నిఘా విభాగాధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ తదితరులపై కేసు నమోదు చేశారు.

# టీడీపీ నేతల రౌడీయిజం..

**స్కూల్ విద్యా కమిటీ ఎన్నికల్లో అరాచకం**



గుంటూరు: ప్రత్తిపాడు మండలం పెద్ద గొట్టిపాడులో తెలుగుదేశం నాయకుల రౌడీయిజానికి దిగారు. జడ్పీ హైస్కూల్‌లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక వ్యవ హారంలో తెలుగు తమ్ముళ్లు అరా చాకానికి పాల్పడ్డారు.విద్యా కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులతో బూసి యేసు మరియమ్మ చైర్మన్‌గా ఎంపికయ్యారు. దీంతో మరియమ్మ గెలిచనట్లు అధికారులు ప్రకటించారు.అయితే అధికారులపై ఒత్తిడి తెచ్చిన టీడీపీ నేతలు.. బూసి ఏసు మరియమ్మ పానెల్ గెలుపును రద్దు చేయించారు. అంతేగాక వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై దాడి చేసి పోలీసులు సహాయంతో బయటకు నెట్టేశారు. అనంతరం తెలుగుదేశం మద్దతుదారుల ప్యానెల్ గెలిచినట్టు అధికారులతో ప్రకటన చేయించుకున్నారు

.విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు భారీ స్థాయిలో జడ్పీ హైస్కూల్‌కు తరలి వచ్చారు. ప్రజాస్వామ్య బద్దంగా ఒక దళిత మహిళ చైర్మన్ అయితే ఎందుకు రద్దు చేశారంటూ ఇంచార్జి ప్రిన్సిపాల్‌తో తల్లిదండ్రుల వాగ్వాదానికి దిగారు. తమ పిల్లలకు టీసీలు ఇచ్చేయమని పట్టుబట్టారు. ఉదయం నుంచి పిల్లల టీసీల కోసం గొడవ చేశారు.

# ఆలస్యం కావచ్చు..కానీ తిరస్కరణ జరగదు

**సిసోడియాకు బెయిల్‌పై సునీతా కేజ్రీవాల్ స్పందన**





న్యూఢిల్లీ,ఆగస్ట్9: ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత మనీశ్ సిసోడియాకు భారీ ఊరట లభించిన క్రమంలో సిఎం కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ స్పదించారు. మద్యం కుంభకోణం కేసులో ఆయనకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూ చేసింది. ఈ నేపథ్యంలో సిసోడియాకు బెయిల్ రావడంపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ సతీమణి సునీతా కేజీవ్రాల్ తాజాగా స్పందించారు. ఆలస్యం అయినా న్యాయమే గెలుస్తుందని అర్థం వచ్చేలా ఓ ట్వీట్ పెట్టారు. 'న్యాయం జరగడంలో కొంత ఆలస్యం కావొచ్చు. కానీ, తిరస్కరించబడదు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.మద్యం కుంభకోణం కేసులో గతేడాది ఫిబ్రవరి 26న సిసోడియాను అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి తీహార్ జైల్లోనే ఉంటున్నారు. బెయిల్ కోసం తీవ్రంగా పోరాటం చేశారు. ఈ క్రమంలో సుప్రీం తీర్పుతో 17 నెలలుగా జైలు జీవితాన్ని గడుపుతున్న సిసోడియాకు భారీ ఊరట లభించినట్లైంది. ఈ నేపథ్యంలో దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పుపై ఆమ్ ఆద్మీ పార్టీ సంతోషం వ్యక్తం చేసింది. చివరికి సత్యమే గెలిచింది అంటూ ఆప్ నేతలు సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నారు. ఇక ఇదే కేసులో సీఎం అరవింద్ కేజీవ్రాల్ కూడా అరెస్టైన విషయం తెలిసిందే. ఈ ఏడాది మార్చిలో కేజ్రీని ఈడీ అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి ఆయన కూడా బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ.. ప్రస్తుతం సీబీఐ కేసులో తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.మరోవైపు కేజీ జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 20 వరకు పొడిగిస్తూ రౌస్ అవెన్యూ కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

కస్టడీ గడువు ముగియడంతో సీబీఐ ఆయనను తిహార్ జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచారు. మద్యం పాలసీ కేసులో సిబిఐ అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజీవ్రాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం కొట్టివేసిన విషయం తెలిసిందే.

# నీట్-పీజీ పరీక్ష వాయిదాకు సుప్రీంకోర్టు నిరాకరణ



వైద్యవిద్యా పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్-పీజీ పరీక్షను వాయిదా వేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది.ఈ మేరకు నీట్-పీజీని వాయిదా వేయాలని కోరుతూ పలువురు విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివే సింది. పరీక్షను వాయిదా వేసి విద్యార్థుల జీవితాలను ప్రమాదంలోకి నెట్టలేమని వ్యాఖ్యానించింది

.నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ నిర్వహించే 'నీట్-పీజీ పరీక్ష ఆగస్టు 11న (ఆదివారం) జరగనుంది. అయితే దీనిని వాయిదా వేయాలని కోరుతూ విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు మనోజ్ మిశ్రా, జేబీ పార్దివాలాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.రెండు రోజుల్లో పరీక్ష నిర్వహిం చాల్సి ఉండగా... ఈ సమయంలో వాయిదా వేయాలని ఆదేశించలేమని పేర్కొంది. 'ఇలాంటి పరీక్షలను మనం ఎలా వాయిదా వేయగలం? ఈ మధ్యకాలంలో పరీక్షను వాయిదా వేయమని అడుగుతూ పిటిషన్లు వేస్తున్నారు. ఇది పరిపూర్ణ ప్రపంచ ేమేమి కాదు .మేము విద్యా నిపుణు లం కాదు.రెండు లక్షల మంద విద్యార్థులు హాజరవుతారు. కొంతమంది అభ్యర్థులు వాయిదా వేయాలని కోరినందుకు దీనిని రీ షెడ్యూల్ చేయాలని అనుకోవ డం లేదు. పరీక్షను వాయిదా వేయడం ద్వారా రెండు లక్షల విద్యార్థులు, 4 లక్షల మంది తల్లిదండ్రులు ప్రభావి తమవుతారు. ఈ పిటిషన్ల కారణంగా మేము విద్యార్థుల భవిష్యత్తును ప్రమా దంలో నెట్టివేయలేం' అని కోర్టు అభిప్రా యపడింది.కాగా నీట్ పీజీ పరీక్షలో ఇప్పటివరకు పేపర్ లీకేజీ ఆరోపణలు రాలేదు. కానీ నీట్-యూజీ 2024 పరీక్షలో అవకతవకలు జరిగినట్లు దేశ వ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమవడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నీట్ పీజీ పరీక్షను సైతం కేంద్రం వాయిదా వేసింది. తొలుత జూన్ 23న నిర్వహించాల్సి ఉండగా తాజాగా ఆగస్టు 11న జరగనుంది.

# ఏసీబీ వలలో మున్సిపల్ అధికారి..



నిజామాబాద్: అవినీతి అధికారుల గుండెల్లో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ గుబులు పుట్టిస్తోంది. తాజాగా నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికా రులకు మరో భారీ అవినీతి తిమింగలం పట్టుబడింది .నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్, రెవెన్యూ అధికారి దాసరి నరేందర్ వద్ద ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని సమాచారంతో ఏసీబీ అధికారులు ఆయన నివాసం, కార్యాలయం, బంధువుల ఇళ్లలో శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏసీబీ అధికారులు భారీ మొత్తంలో గుట్టలుగా ఉన్న నోట్ల కట్టల్ని గుర్తించారు. మొత్తం రూ. 6.70 కోట్లను స్వాధీనం చేసుకున్నారు.ఏసీబీ సోదాల్లో రూ.2కోట్ల 93లక్షల 81వేల నగదు, నరేందర్ బ్యాంకు ఖాతాల్లో రూ. కోటి 10 లక్షల నగదు, అరకిలో బంగారు ఆభరణాలు, 1కోటి 98 లక్షల విలువ చేసే ఆస్తుల్ని సీజ్ చేశారు. మొత్తం 6కోట్ల 7లక్షల విలువగల ఆస్తుల గుర్తించారు.

ఆదాయం మించిన ఆస్తుల కేసులో నరేందర్‌పై కేసు నమోదు చేశారు.

అక్రమాస్తుల కేసులో విచారణ కొనసాగుతుంది. ప్రస్తుతం మున్సిపల్ అధికారి నరేందర్ బంధువుల ఇళ్ళలో ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగు తున్నాయి. నరేందర్‌ను అరెస్ట్ చేసిన అధికారులు హైదారాబాద్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టేందుకు తరలించారు.

# మనీష్ సిసోడియాకు భారీ ఊరట

**బెయిల్ మంజూరు చేసిన సుప్రం కోర్టు- 17 నెలల సుదీర్ఘ కాలంతరవాత విముక్తి**



న్యూఢిల్లీ,ఆగస్ట్9 సిసోడియాకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను సుప్రీం మంజూరు చేసింది. ఈ మేరకు ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీష్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. ఎక్సైజ్ పాలసీ కేసులో 17 నెలల తర్వాత ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తుది తీర్పును వెలువరించింది. ప్రతి సోమవారం దర్యాప్తు సంస్థ ముందు హాజరుకావాలని సిసోడియాను సుప్రీం ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా సుప్రీం విచారించింది. విచారణ పూర్తయిన అనంతరం కొద్ది రోజుల క్రితం తీర్పును రిజర్వ్ చేసి నేడు వెలువరించింది. ఈ క్రమంలోనే 17 నెలల తర్వాత మనీష్ సిసోడియా బయటకు రానున్నారు. కొద్ది రోజుల క్రితం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్‌కు ఢిల్లీ మద్యం విధానం కేసులో బెయిల్ లభించింది. ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు సైతం బెయిల్ మంజూరు కావడంతో ఆప్ నేతలు ఊపిరి పీల్చుకున్నారు. అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో సిసోడియాకు బెయిల్ సుప్రీం బెయిల్ ఇచ్చింది. ఏ నిందితుడిని కాలపరిమితి లేకుండా జైలులో ఉంచలేరని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేసు విచారణలో పురోగతి లేకపోతే... ఒక పరిమితి దాటిన తర్వాత జైలులో ఉంచలేరని పేర్కొంది. అలా కాదు అని... జైలులో ఉంచాలి అనుకుంటే ఆ వ్యక్తి హక్కులు హరించడమేనని సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. బెయిల్‌కి అప్లికేషన్ పెట్టుకోవడం,

బెయిల్ పొందడం వారి హక్కు అని ధర్మాసనం పేర్కొంది. విచారణ ఆలస్యం కావడానికి సిసోడియా కూడా కారణమన్న ట్రయల్ కోర్టు ఆదేశాలను సైతం పక్కనబెట్టింది. ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు చేసిన ప్రతికూల వ్యాఖ్యలను కూడా సర్వోన్నత న్యాయ స్థానం కొట్టివేసింది. బెయిల్ అనేది నియమమని.. జైలు మినహాయింపు అని ట్రయల్ కోర్టులు, హైకో ర్టులు గ్రహిం చాల్సిన సమయం ఆసన్నమైందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ట్రయల్ వేగంగా జరిగేందుకు సిసోడియా సహరించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. సిసోడియా బెయిల్‌ను ఈడీ, సీబీఐ వ్యతిరేకిం చాయి. సిసోడియా విచారణకు సహకరిం చడం లేదని, సుప్రీంకోర్టుకు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. సిసోడియాకు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను, సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని బెయిల్ ఇవ్వొద్దని సుప్రీంకోర్టును దర్యాప్తు సంస్థలు కోరాయి. గతేడాది అక్టోబర్ నుంచి తనపై ఉన్న కేసుల్లో ఎలాంటి పురోగతి లేదని కాబట్టి తనకు బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును సిసోడియా కోరారు. మొత్తానికి ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
శనివారం 10 ఆగష్టు 2024

# క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదపడతాయి

- పండుగ వాతావరణంలో ప్రారంభమైన ఏఐఎస్ఎఫ్
- క్రీడా,సాంస్కృతిక వేడుకలు
- ఎంఈవో కె లక్ష్మి



చిలకలూరిపేట, మన వెలుగు, ఆగస్టు 09 :
క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదడతాయని, క్రీడా స్ఫూర్తితో పోటీల్లో క్రీడాకారులు పాల్గొనాలని చిలకలూరిపేట ఎంఈవో లక్ష్మి అన్నారు. ఏఐఎస్ఎస్ ఆవిర్బావ దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం ను పురస్కరించుకొని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే నియోజకవర్గ స్థాయి క్రీడా , సాంస్కృతిక వేడుకలు శుక్రవారం పట్టణంలోని సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూలో పండుగ వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు వాలీబాల్, త్రోబాల్ పోటీలను ఎంఈవో ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని, వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సహపరిచారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు తల్లిదండ్రులు కూడా సహకరించా లని కోరారు. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకో వాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించు కోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని తెలిపారు.క్రీడా , సాంస్కృ తిక వేడుకలు నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులను ఆమె అభినందించారు. నియోజకవర్గంలో నలు మూలల నుంచి 40 క్రీడా జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.పోటీలు హోరాహోరాగా కొనసాగుతున్నాయి. పోటీలను వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం షేక్ ఖాదర్ మస్తాన్, పీఈటీలు రాజు, డీవీ రాజు, నాగరాజు, మనోహర్, ఆనంద్, షలోమి, అస్మిత్‌లు పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా ఇన్‌చార్జి కార్యదర్శి నాగబైరు సుబ్బాయమ్మ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాసర్జి, ఇన్‌చార్జి బి భగత్‌సింగ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు, నాయకులు నాయుడు శివ, ఆరాధ్యుల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ ఏరియా అధ్యక్షుడు మేకపోతుల నాగేశ్వరరావు, కార్యదర్శి తలాని డాపి,. నాయకులు ఎం సాయినాయక్, మధు, లోకేష్‌నాయక్, పి గోపి, సాహిత్, జాన్‌వెస్లీ, చౌదరయ్య పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ బాష తదితరులు పాల్గొన్నారు.

## మహిళ పై దురుసుగా ప్రవర్తించిన పోలీసులు




మెట్ పల్లి,(మన వెలుగు) ఆగస్టు 09 : మెట్ పల్లి పట్టణ కేంద్రంలోని పోలీస్ స్టేషన్ కు కుటుంబ సమస్యలతో వచ్చిన భార్యాభర్తలు ఇద్దరు పోలీస్ స్టేషన్ ఆవరణలో గొడవపడ్డారు. ఇది గమనించిన ఏఎస్ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ అశోక్ లు సదరు మహిళ పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ భార్యాభర్తల గొడవను సర్దుమనిపించే క్రమంలో మహిళపై పోలీసులు లాఠీతో కొట్టడం పలు విమర్శలకు తావిస్తోంది.పోలీస్ స్టేషన్ ఆవరణలో జరుగుతున్న ఈ తతంగాన్ని ఎవరో వీడియో తీసి సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేయడంతో మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించి, మహిళ అని చూడకుండా లాఠీతో కొట్టిన పోలీసుల తీరుపై నెటిజన్లు మండిపడుతున్నారు.ఘటనకు సంబంధించిన గొడవ పై ఉన్నతాధికారులు విచారణ చేసి మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# అను'మతి'లేని భవనాలు...

- అధికారులు అసలున్నట్టా లేనట్టా.?
- పేదోనికి ఒక న్యాయం..!! పెద్దోనికి ఒక న్యాయం..!!!
- అధికారుల తీరుపై మండిపడుతున్న జనం..







మెట్ పల్లి / మన వెలుగు, ఆగస్టు 09 :మెట్ పల్లి పట్టణంలో అక్రమ, అనధికార, అదనపు అంతస్తుల నిర్మాణాలు జోరుగా సాగుతోన్నాయి. ఆ నిర్మాణాలలో సెట్ బ్యాకు లేకపోయినా పట్టించుకునే వారే కరువయ్యారు. విచ్చల విడిగా సాగుతున్న నిర్మాణాలపై స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోకపోవడంతో మెట్ పల్లి మున్సిపాలిటీ తీరుపై ప్రజలు మండిపడుతోన్నారు. తప్పని పరిస్థితుల్లో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కొన్నిసార్లు అక్రమ నిర్మాణాలు కూల్చివేసి హడావిడి చేసి వెళ్లిపోతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా అక్రమంగా నిర్మాణాలు నిర్మిస్తున్నా పట్టించుకోవడం లేదని, సామాన్యులు, పేద మధ్యతరగతి ఉద్యోగుల చిన్నచిన్న నిర్మాణాలపై వారు తమ ప్రతాపం చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది అందినకాడికి దండుకుని చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ కలెక్షన్‌లపైనే దృష్టిసారించారనే ఆరోపణలు వస్తున్నాయి. అంతేగాకుండా అక్రమ నిర్మాణాలకు కొంతమంది రాజకీయ నేతలు, దళారులు అండగా నిలుస్తుండటంతో చర్యలు తీసుకునేందుకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జంకుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పట్టణంలో కుప్పలు తెప్పలుగా అక్రమ నిర్మాణాలు వెలుస్తోన్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్న ధాఖలాలు లేవు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే దాని ఆధారంగా టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడికి వెళ్లి అందినంత దండుకుని వస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తోన్నాయి. పలు పత్రికల్లో పలుమార్లు కథనాలు వచ్చినా ఫిర్యాదు స్వీకరించిన ఉన్నతాధికారుల నుండి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు వచ్చిన కూడా తప్పుడు నివేదికలు ఇస్తూ కాలయాపన చేస్తున్నట్టు సమాచారం. పట్టణంలోని ఓ భవనానికి సంబంధించి నిర్మాణాన్ని కూల్చివేయాలని రాష్ట్ర హైకోర్టు నుండి ఉత్తర్వులు ఉన్నప్పటికీ కోర్టు ఉత్తర్వులను దిక్కరించి స్వయంగా మున్సిపల్ అధికారులు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారంటే దీంట్లో ఎన్ని ముడుపులు చేతులు మారాయో స్పష్టంగా తెలుస్తుంది.

గతంలో మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలపై ఎన్ఫోర్మెంట్ అధికారులకు నోటీసులు జారీ చేసినప్పటికీ నోటీసులు అందిన కూడా అధికారులు జేబులు నింపుకుంటు అక్రమ కట్టడాలను తొలగించడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. మధ్య వర్తులుగా ఉన్న నాయకులకు కొంత మంది అధికారులు పూర్తిగా దాసోహమైనట్లు ఆరోపణలు ఉన్నాయి. సదరు దళారి నేతలు ఏది చెబితే అది చేస్తామంటూ వారు ముందుకు వస్తున్నారు. వీరిని కాదని నిర్మాణాలు చేపడితే వెంటనే నిబంధనలు ఉల్లంఘించారని టౌన్ ప్లానింగ్ యంత్రాంగం అక్కడ వాలిపోతుంది. కొందరు దళారులే అధికారులు, భవన యాజమానుల మధ్య దళారులు మధ్యవర్తులుగా ఉండి డబ్బులు దండుకున్న సంఘటనలు చాలా ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని వెంపేట గ్రామంలో అక్రమంగా అనుమతి వెంచర్లలో అక్రమ కట్టడాలను నిర్మిస్తున్నారు. అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదంటూ ప్రజలు అధికారులపై పలు పరోపణలు వ్యక్తం చేస్తున్నారు. పెదోనికి పెద్దానికి న్యాయం ఎలా జరుతుంది అని ప్రజలు కూడా అధికారుల పని తీరును చూడాలి అంటూ చర్చించుకుంటున్నారు.

# ఉద్యమానికి ఊపిరి పోసింది జగిత్యాల జర్నలిస్టులే,

**విలేఖరులను చిన్న చూపు చూడడం తగదు,**

**వెంటనే ఇండ్ల స్థలాలు ఇచ్చి - నిర్మాణం చేపట్టాలి,**

**కోరుట్ల మైనార్టీ రిపోర్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్.**







జగిత్యాల / మన వెలుగు, ఆగస్టు 09 :
జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో గత ఏడు రోజులుగా కొనసాగుతున్న జర్నలిస్టుల నిరసన దీక్షకు శుక్రవారం కోరుట్ల మైనార్టీ రిపోర్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు హాజరై దీక్షల కు సంఘీభావం తెలిపారు.ఈ మైనారిటీ రిపోర్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అన్వర్ సిద్ధికి ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో చల్ల బడిన ఉద్యమానికి ఊపిరి పోసింది జగిత్యాల జీల్లా జర్నలిస్టులేనని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ఉద్యమ కాలంలో పనిచేసిన జర్నలిస్టులను కూడా గుర్తించక పోవడం బాధాకరం అన్నారు.వెంటనే స్థానిక ఎమ్మెల్సీలు టి.జీవన్ రెడ్డి, ఎల్.రమణ, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్, పాలక వర్గం నిర్ణయించుకొని జగిత్యాల జర్నలిస్టులకు అందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇండ్ల నిర్మాణం కూడా ప్రభుత్వం ద్వారా చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జర్నలిస్ట్ సంఘాలన్నీ ఏకమై ఉద్యమాలను మరింత ఉధృతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.ఇండ్ల స్థలాలు - ఇండ్లు ఇచ్చేది ఈ నాయకుల బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు.మైనార్టీ రిపోర్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అన్వర్ సిద్ధికి తెలిపారు. జర్నలిస్టుల దీక్షకు మేము మద్దతు తెలియజేస్తున్నామని అన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఇకముందు చేసే ఉద్యమాలలో కూడా బాధ్యతగా పాల్గొంటామని హామీ ఇచ్చారు.ప్రధాన కార్యదర్శి మీర్జా ముక్రం బైగ్,ఎండీ ముజహిద్, ఎం ఏ జమీల్, ఎండీ రఫీ, ఎండీ మసీద్దీన్, మొమ్మద్ హుసైన్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయంలో బయటపడ్డ అవినీతి తిమింగలం

**6 కోట్ల 7 లక్షల విలువ గల ఆస్తులను గుర్తించిన ఏసిబి అధికారులు**





నిజామాబాద్,మన వెలుగు , ఆగస్టు 09 : మున్సిపల్ కార్యాలయంలో బయటపడ్డ అవినీతి తిమింగలం, ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలపై రెవిన్యూ ఆఫీసర్ నరేందర్ ఇంట్లో శు క్రవారం ఉదయం నుంచి కొనసాగుతున్న ఏసీబీ సోదాలు చేశారు. భారీగా నగదు, బంగారు ఆభరణాలు, ఆస్తులు స్వాధీనం చేసుకున్నారు. నరేందర్ ఇంటితో పాటు కార్యాలయంలో మరియు బంధువుల ఇంట్లో కూడా అధికారుల తనిఖీలు చేశారు. ఏసీబీ సోదాల్లో పట్టుబడ్డ రూ. 2 కోట్ల 93 లక్షల 81 వేలను నగదును స్వాధీనం చేసుకున్నారు. నరేందర్ బ్యాంకు ఖాతాల్లో 1 కోటి 10 లక్షలు ఉన్నట్టుగా అధికారులు గుర్తించారు. 6 కేజీల బంగారు ఆభరణాలు,17 స్థిరాస్తుల ఉన్నట్టుగా అధికారులు గుర్తించారు. మొత్తం 6 కోట్ల 7 లక్షల విలువగల ఆస్తులను ఏసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# సంగారెడ్డి జిల్లాలో బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య

సంగారెడ్డి, మన వెలుగు,ఆగస్టు 09 :
యువకుడి వేధింపులు తాళలేక యువతి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ డుగు గ్రామానికి చెందిన తేజేశ్వని బీఫార్మసీ చదువుతోంది. తనను ప్రేమించా లంటూ అదే గ్రామానికి చెందిన యువకుడు అతని స్నేహితులతో కలిసి తరచూ విద్యార్థినినీ, ఆమె తల్లిని బెదిరింపులకు గురి చేస్తున్నారు.దీనిపై పెద్దలు జోక్యం చేసు కుని పంచాయితీ పెట్టినా వేధింపులు ఆగలేదు. దీంతో ఏమీ తోచని పరిస్థితుల్లో ఆ యువతి తాను ఉంటున్న భవనం నాలుగు అంతస్తులపై నుండి కిందకు దూకి శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారు యువతిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా మార్గ మధ్యంలో తేజేశ్వని మృతి చెందింది.ఆత్మహత్యకు గ్రామంలోని



గంజాయ్ బ్యాచ్ కారణమంటూ బంధువులు ఆందోళన చేపట్టారు.నిందితులను ఉరితీయాలంటూ డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మన వెలుగు
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
శనివారం 10
ఆగస్టు 2024

# గ్రామీణ నేపథ్యంలో సాగిన కమిటీ కుర్రోళ్లు



మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మించిన 'కమిటీ కుర్రోళ్ళు' సినిమా... పవన్‌కల్యాణ్‌కు అభిమాని అయిన యదు వంశీ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యారు. 11 మంది కొత్త హీరోలు, నలుగురు హీరోయిన్లతో ఈ చిత్రం తెరకెక్కింది. సాయికుమార్, గోపరాజు రమణ, సీనియర్ నటి శ్రీ లక్ష్మి, 'కేరాఫ్ కంచరపాలెం' ఫేమ్ కిశోర్ కీలక పాత్రధారులు. ఇప్పటి వరకూ ఓటీటీ సిరీస్‌లకు నిర్మాతగా వ్యవహరించిన నిహారికకు నిర్మాతగా తొలి సినిమా ఇది. గ్రామీణ నేపథ్యం అంటూ ట్రైలర్లు, పోస్టర్‌లను ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అది గోదావరి జిల్లాల్లోని పురుషోత్తమపల్లి అనే గ్రామం. అక్కడ గ్రామ దేవత బరింకాలమ్మ తల్లి. 12 ఏళ్లకు ఓసారి ఘనంగా జరిగే జాతర. స్నేహానికి మారుపేరుగా ఉండే 11మంది కుర్రోళ్లు. వారి ఆటలు, పాటలు. ఈసారి జాతర జరిగిన పది రోజులకు సర్పంచ్ ఎన్నికలు. ఆ ఎన్నికల్లో శివ (సందీప్ సరోజ్) సర్పంచ్‌గా, అతనికి ఎదురు పోలిశెట్టి బుజ్జి (సాయికుమార్) పోటీ చేయడానికి సన్నాహాల్లో ఉంటారు. అయితే గత జాతరలో 11 మంది స్నేహితుల్లో కులం రిజర్వేషన్ కారణంగా జరిగిన గొడవలో స్నేహితుడు ఆత్రం (నరసింహా) మరణిస్తాడు. దాంతో స్నేహితుల్లో కొందరు తలో దారికి వెళిపోతారు. ఆ స్నేహితులంతా జాతరలో కలిశారా? కులాలను అడ్డుపెట్టుకుని పన్నెండేళ్ల క్రితం జరిగిన గొడవను ఎప్పటికప్పుడు రగిలిస్తూ స్వార్థ ప్రయోజనాల కోసం పరితపించే ఊరి జనాలు ఎవరు? ప్రస్తుత ప్రెసిడెంట్ పోలిశెట్టి బుజ్జి (సాయి కుమార్) పాత్ర ఏమిటి? ఈసారి జాతరను 11 మంది కమిటీ కుర్రోళ్లు ఎలా చేశారు అన్నది కథ. పురుషోత్తమ పల్లి అనే గ్రామంలో 12 ఏళ్లకు ఒకసారి వచ్చే జాతర నేపథ్యంలో సాగే కథ ఇది. దానికి 11 మంది చిన్ననాటి స్నేహితులు, ప్రేమ, రాజకీయం ఇలు పలు అంశాలను మిళితం చేసి దర్శకుడు యదువంశీ తెరకెక్కించారు. ఫస్టాఫ్ పాత్రల పరిచయం, వారి చిన్నతనం, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తూ సాగింది. ఇంటర్వెల్ సమయానికి 11 మంది మిత్రుల్లో చిన్న కలహం అది ప్రాణాలు తీసేవరకూ వరకూ వెళ్లడం ఒక ట్విస్ట్‌లాగా ఇచ్చారు. పాత్రల పరిచయం, చిన్నప్పటి విషయాలు చెప్పడం కాస్త సాగదీతగా అనిపించినా స్నేహం మీద ఒక పాట, సంగీతం ఆ భావనను దూరం చేశాయి. 90ల్లో గ్రామీణ ప్రాంతాల జీవలశైలి కులమతాలకు అతీతంగా స్నేహితుల మధ్య మైత్రీ, అప్పటి ఆటలు, ప్రేమకథలు, భావోద్వేగాలను దర్శకుడు తన అనుభవం పరంగా హృద్యంగా, వినోదాత్మకంగా చెప్పాడు.

# వినూత్న కథాంశంతో సింబా




ఓ వైపు దర్శకునిగా స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూనే మరోవైపు కథా రచయితగా వినూత్నమైన కాన్సెప్ట్‌తో పలు సినిమాలకు షోరన్నర్ గా వుంటున్నారు దర్శకుడు సంపత్ నంది. గాలిపటం, పేపర్ బాయ్, ఓదెల రైల్వేస్టేషన్ ఆయన కథలతో వచ్చిన సినిమాలే. ఇప్పుడు ఆయన కథతో మరో సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అదే 'సింబా'. రంగస్థలంలో పవర్ ఫుల్ రోల్స్ లో ఆదరగొట్టిన జగపతి బాబు., అనసూయ లాంటి స్టార్స్ ఇందులో ప్రధాన పాత్రలు పోషించడంతో సినిమా అందరి దృష్టిని ఆకర్షించింది. ప్రకృతి నేపథ్యంలో ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్, సైంటిఫిక్ ఎలిమెంట్స్ జోడించి మురళీ మనోహర్ రెడ్డి తీసిన 'సింబా' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హైదరాబాద్ లో ఓ దారణ హత్య జరుగుతుంది. చనిపోయిన వ్యక్తి పార్థ(కబీర్ సింగ్) గ్రూపుకి సంబధించిన కీలక వ్యక్తి. దీంతో ఈ కేసును సీరియస్ గా తీసుకుంటారు పోలీసులు. విచారణ జరుగుతుండగానే మరో హత్య జరుగుతుంది. ఈ రెండు హత్యల వెనుక స్కూల్ టీచర్ అక్షిక(అనసూయ), ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ ఫాజిల్(శీనాథ్ మాగంటి) ఉన్నారని నిర్ధారించిన పోలీసులు వారిద్దరిని అరెస్ట్ చేస్తారు. ఇంతలో వీరిద్దరిని చంపాలని చూసి వ్యక్తి పోలీసుల సమక్షంలోనే హత్యకు గురౌతాడు. తర్వాత ఏం జరిగింది ? అసలు ఈ వరుస హత్యలకు కారణం ఏమిటి ? ఎవరు చంపుతున్నారు ? పార్థకి, హత్యలు చేస్తున్న వ్యక్తికి లింక్ ఏమిటి ? ఇందులో పురుషోత్తమ్ రెడ్డి(జగపతిబాబు) పాత్ర ఏమిటి ? ఇదంతా మిగతా కథ. 'సింబా'లో బయోలాజికల్ మెమరీ కాన్సెప్ట్ ఆధారంగా ఒక రివెంజ్ డ్రామాగా ఈ కథని తీర్చిదిద్దిన తీరు ఆకట్టుకునేలానే వుంటుంది. ముఖ్యంగా ఒక క్రైమ్ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్ లో పర్యావరణం, పకృతి పరిరక్షణ గురించి చెప్పిన తీరుని అభినందనీయం. నిజానికి సమాజానికి చాలా అవసరమైన అంశం ఇది. మర్డర్ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ తరహాలో సినిమా మొదలౌతుంది. ఫస్ట్ హాఫ్ లో వచ్చే వరుస హత్యలు కథపై ఆసక్తిని పెంచుతాయి. సెకండ్ హాఫ్ లో అసలు పాయింట్ రివిల్ అవుతుంది. ఫారెస్ట్ మ్యాన్ గా జగపతి బాబు క్యారెక్టర్ చుట్టూ వున్న నేపథ్యం ఆసక్తికరంగా తీశారు.చాలా సన్నివేశాలు ప్రేక్షకులు ఊహకు అందిపోతుంతాయి. ఫస్ట్ హాఫ్ లో పోల్చుకుంటే సెకండ్ హాఫ్ లో వచ్చే కథనం ఆసక్తికరంగా వుంటుంది.జగపతిబాబు తన అనుభవంతో ఈ పాత్రని చాలా యీజ్ తో చేశారు. ఆయన ఇమేజ్, ఆహార్యం పాత్రకు తగ్గట్టుగా వుంది అనసూయ, శ్రీనాథ్ మాగంటి పెర్ఫార్మెన్స్ డీసెంట్ గా వుంది. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా వశిష్ఠ సింహాకి మంచి మార్కులు పడతాయి. కబీర్ పాత్రని ఇంకా బలంగా తీర్చిదిద్దాల్సింది. గౌతమి, కస్తూరి స్పెషల్ రోల్స్ లో కనిపిస్తారు. ఇక మురళీ మనోహర్ దర్శకుడిగా తన తొలి ప్రయత్నంలోనే సక్సెస్ అయ్యాడని చెప్పాలి.



## నేను ఒంటరినని చెప్పలేదే: కీర్తిసురేశ్

కెరీర్ ఆరంభంలో తాను ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నానని నటి కీర్తి సురేశ్ తెలిపారు. తాను నటించిన చాలా సినిమాలు బాక్సాఫీస్ వద్ద పరాజయం పొందాయని.. దాంతో చాలామంది తనని విపరీతంగా విమర్శించారని ఆమె చెప్పారు. వారి మాటల వల్ల కొన్ని సందర్భాల్లో తాను ఎంతో బాధపడ్డానని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. అంతేకాకుండా తన రిలేషన్‌షిప్ స్టేటస్ గురించి మాట్లాడుతూ తాను సింగిల్ కాదని తెలిపారు.వర్క్ లైఫ్ విషయంలో చాలా సంతోషంగా ఉన్నా. మనసుకు నచ్చిన చిత్రాల్లో యాక్ట్ చేస్తున్నా. కెరీర్ ఆరంభంలో నేను యాక్ట్ చేసిన చాలా చిత్రాలు ఎ÷-లాప్ అయ్యాయి. దాంతో నేను ఎన్నో ట్రోల్స్ ఎదుర్కొన్నా. నాకు తెలిసి అత్యధిక ట్రోల్స్ ఎదుర్కొన్న దక్షిణాది నటిని నేనే. 'మహానటి' తర్వాత నాపై ట్రోల్స్ తగ్గాయి. విమర్శలను నేనూ స్వాగతిస్తా. వివరణాత్మక విమర్శల నుంచి కొత్త విషయాలు నేర్చుకుంటా. కానీ, కొంతమంది కావాలని నెగెటివ్ కామెంట్స్ చేస్తుంటారు. వాటిని పెద్దగా పట్టించుకోను. ఎక్కడా రియాక్ట్ కాను. కాలమే అన్నింటికీ సమాధానం చెబుతుందని భావిస్తున్నా అని కీర్తి సురేశ్ తెలిపారు. పెళ్లి గురించి మాట్లాడుతూ.. ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాన్ని కొనసాగించడమే పెళ్లి అని నా భావన అని అన్నారు. దీంతో విలేకరి సింగిల్‌గా ఉంటున్నారు. బోర్‌గా అనిపించడం లేదా? అని ప్రశ్నించగా.. సింగిల్ అని నేను చెప్పలేదుగా అని నవ్వుతూ బదులిచ్చారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. కీర్తిసురేశ్ రిలేషన్‌లో ఉన్నారని పలువురు నెటిజన్లు భావిస్తున్నారు. అదే విషయాన్ని ఆమె పరోక్షంగా చెప్పిందనుకుంటున్నారు. కీర్తిసురేశ్ నటించిన తాజా చిత్రం 'రఘు తాత'. సుమన్‌కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆగస్టు 15న ఇది విడుదల కానుంది. మరోవైపు, ఆమె 'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నారు. వరుణ్ ధావన్ హీరోగా ఈ సినిమా సిద్ధమవుతోంది.

# ఎట్టకేలకు అక్కడ ఇల్లు కొన్నా




# ఎన్టీఆర్.ప్రశాంత్ నీల్ కాంబినేషన్

పూజా కార్యక్రమలతో ప్రారంభం జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో 'ఎన్టీఆర్31' శుక్రవారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం రామానాయుడు స్టూడియోస్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ ఇరు కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. 'కేజీఎఫ్', 'సలార్' సినిమాలతో సక్సెస్ రేస్‌లో ఉన్న ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్‌తో సినిమాను ప్రకటించి చాలాకాలమైంది. తారక్ ఆర్ఆర్ఆర్, తదుపరి దేవర చిత్రాలతో బిజీగా ఉండటం, నీల్ సలార్ షూటింగ్‌తో బిజీగా ఉండటంతో సినిమా ప్రారంభం డిలే అయింది. వీరిద్దరి కాంబినేషన్ లో సినిమా కోసం అభిమానులు ఎంతో ఆతురతగా ఎదురు చూస్తున్నారు. 2026 జనవరి 9 ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని చిత్ర బృందం తెలిపింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశాంత్ నీల్ మాట్లాడుతూ 'ఈ చిత్రాన్ని అందరూ ఓ యాక్షన్ సినిమాలా భావిస్తారని నేను ముందే ఊహించాను. కానీ నేను నా జానర్‌లోకి వెళ్లాలనుకోవట్లేదు. నిజానికిది భిన్నమైన భావోద్వేగాలతో వైవిధ్యభరితంగా ఉండే చిత్రంగా ఉంటుంది. నాకిది చాలా కొత్త కథ' అని అన్నారు. 'ఎన్టీఆర్31' వర్కింగ్ టైటిల్‌తో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పేరు ఖరారు చేసినట్లు వార్తలు వినిపించాయి. అయితే టైటిల్ ఏంటనేది ఇంకా వెల్లడించలేదు.